చెట్లను నరికి వేసిన దృశ్యం

హరితహారంపై గొడ్డలి వేటు

- ఏండ్ల తరబడి కాపాడిన చెట్లు మాయం
- కాల్చివేయడం, నరికి వేతకు గురవుతున్న వైనం
- అధికారులు ఎందుకు స్పందిండం లేదని ప్రశ్నిస్తున్న ప్రజలు

మోర్తాడ్, ఏప్రిల్ 21: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పచ్చదనాన్ని పెంచేందుకు అప్పటి సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతం చేశారు. ఇందులో భాగంగా తొమ్మిదేండ్ల పాటు ఏటా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి గ్రామాల వారీగా టార్గెట్లు పెట్టి మరీ మొక్కలు నాటించారు. ఇందులో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గ్రామాల్లో ప్రతిరోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటించడం, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వాటికి ప్రతిరోజూ నీళ్లు పట్టించి పెంచడం చేశారు. ఇంత కష్టపడి పెంచిన చెట్టను ప్రస్తుతం కొందరు నరికి వేస్తున్నారు. నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. వడ్యాట్-కమ్మర్‌పల్లి రోడ్డుకు ఇరువైపులా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. మొక్కలను పెరగకుండా చేయడానికి మొక్క కింద నిప్పు పెడుతున్నారు. పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారు. దీంతో ఏండ్లపాటు పడ్డ శ్రమ అంతా వృథా అవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెట్లు నరికి వేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. ఊరూరా నర్సరీలు నిర్వహిస్తూ మొక్కలను పెంచి వాటిని నాటడం నరికేయడం కోసమేనా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చెట్లను నరికి వేయడంతో మిగిలిన మోడులు

రోడ్డు పక్కన కనిపించని చెట్లు

చెట్లను కాల్చివేసిన దృశ్యం

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సంపూర్ణం

- పాల్గొన్న ప్రజాప్రతినిధులు

పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

సుభాష్‌నగర్/ ధర్పల్లి, ఏప్రిల్ 21 : జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో పాటిగల్లీ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నల్ల హనుమాన్ ఆలయంలో ఈనెల 19 నుంచి కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారంతో సంపూర్ణమయ్యాయి. గణపతి, నవగ్రహ, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్థాపిత దేవతాపూజ, హోమం, విగ్రహ ప్రతిష్ఠాపన, మహా పుర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో పూజలు, అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్త వేణు, ఉపాధ్యక్షుడు ముత్యాల భాస్కర్, సభ్యులు పాల్గొన్నారు.

ధర్పల్లి మండలకేంద్రంలోని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ నర్సింహ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. గణపతి పూజ, నవగ్రహ పూజ, క్షేత్రపాలక మండల పూజ, సర్వతోభద్ర మండప పూజ, ఆవాహిత హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. శాలివాహన సంఘ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

నిజామాబాద్ అభివృద్ధిలో అర్వింద్ విఫలం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

కంఠేశ్వర్, ఏప్రిల్ 21 : నిజామాబాద్‌ను అభివృద్ధి చేయడంలో ఎంపీ అర్వింద్ విఫలమయ్యాడని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్‌ను స్మార్ట్‌సిటీ తీర్చిదిద్దే వీలున్నా అర్వింద్ నిర్లక్షంతోనే స్మార్ట్ సిటీ హోదా రాలేదని విమర్శించారు. అర్వింద్ ఐదేండ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. పసుపు బోర్డు హామీ కేవలం బాండ్‌పేపర్‌కే పరిమితమైందన్నారు. ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్‌కు బోధన్ నుంచి బీదర్‌కు రైల్వే లైన్ వేస్తే వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి జరుగుతుందని, ముంబై ట్రైన్‌కు జగిత్యాలలో కనీస హాల్టింగ్ లేదని ఇవన్నీ అర్వింద్ నిర్లక్ష్యం కదా అని ప్రశ్నించారు. అత్యంత పనిచేయని ఎంపీగా అర్వింద్ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో తెలిపి తర్వాత షుగర్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశ వేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21 : కమ్మర్‌పల్లి గ్రీన్ ఫీల్డ్ బ్యాట్మింటన్ అసోసియేషన్ (కేజీబీఏ) నూతన సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మద్దికుంట సజ్జన్, ఈగ శ్రీధర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రెంజర్ల మహేందర్‌రెడ్డి, కార్యదర్శిగా సామ నరేశ్‌రెడ్డి, కోశాధికారి అచ్చ విజయ్‌భాస్కర్, సలహాదారులు లోలపు సుమన్, గుండోజి భరద్వాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు చింత శ్రీకుమార్, నగేశ్, సాంబారి కిషన్, గుజ్జేటి రవి, జిల్లా నిఖిల్, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ఎడపల్లి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని నయాబాదులో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 26 నుంచి రేణుకా ఎల్లమ్మ కల్యాణం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం గౌడ కులస్తులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు జోగు ఎత్తడం నుంచి కల్యాణం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిఆపరు. భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లాగౌడ్, నటరాజు గౌడ్, పుట్ట నర్సాగౌడ్, రవి గౌడ్, నాగ గౌడ్, స్వామి గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంట నష్టంపై వివరాలు సేకరణ

మాక్లూర్, ఏప్రిల్321: మండలంలో అకాల వర్షాలకు పంట నష్ట పోయిన రైతుల వివరాలను సోమవారం గ్రామాల వారీగా సేకరిస్తామని మండల వ్యవసాయాధికారిణి పద్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈదురు గాలులకు వరి పంట నేలకొరిగిందని, మరికొన్ని గ్రామాల్లో వడగళ్ల వాన కురువడంతో వడ్లు నేలరాలయాని, రైతులు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గ్రామాల్లో క్లస్టర్ల వారీగా ఏఈవోలు రైతులను నష్టం వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తారని తెలిపారు. మండలంలో సుమారు 150 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని, మరింత నష్టం పెరిగే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

సార్.. బాగున్నారా..

గ్రామస్తుల ఆప్యాయతకు మాజీ మంత్రి ఫిదా

వేల్పూర్, ఏప్రిల్ 21: తన స్వగ్రామం వేల్పూర్‌లో స్థానికుల ఆప్యాయతకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫిదా అయ్యారు. ఆదివారం మండలకేంద్రంలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎంపీటీసీ మొండి మహేశ్ పిల్లల పుట్టు పంచల కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అక్కడే ఉన్న గ్రామస్తులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి సార్.. బాగున్నారా.. అంటూ పకలరించారు. ఎప్పుడు వచ్చారు.. ఆరోగ్యం ఎలా ఉంది అంటూ పలకరించారు. ఫంక్షన్ హాల్‌లో కుర్చీలో కుర్చున్న గ్రామానికి చెందిన లక్ష్మి ఎమ్మెల్యేను చూసి ఆయన వద్దకు వెళ్లింది. ఎమ్మెల్యే చుట్టూ ప్రజలు ఉన్నా తోసుకుంటూ వెళ్లి సార్ బాగున్నారా.. అంటూ పలకరించింది. 'సార్ మీరు మాకు ఎంతో మేలు చేశారు.. మీరుణం ఎలా తీర్చుకోవాలి.. మా పెద్ద కూతురుకు పెండ్లి చేస్తే కల్యాణ లక్ష్మి పథకంలో డబ్బులు ఇప్పించారు.. చిన్న కూతురుకు కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇచ్చింది సార్ అంటూ ఎమ్మెల్యే రెండు చేతులు పట్టుకుంది. సార్ మాకు మీరు చేసిన సాయం మార్చిపోలేము.. మీ రుణం ఎలా తీర్చువాలి అంటూ ఆమె అన్న మాటలకు ఎమ్మెల్యే ముగ్ధుడయ్యారు. ఫంక్షన్ హాల్ ఉన్న గ్రామస్తులందరినీ ఎమ్మెల్యే పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుకున్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యేతో సెల్ఫీలు తీసుకున్నారు.



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని ఆప్యాయంగా పలుకరిస్తున్న మహిళ

23న నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 21 : ఈ నెల 23న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్ర నేపథ్యంలో జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శోభాయాత్రలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో దుకాణాల ఎదుట వాహనాలను నిలుపవద్దని సూచించారు. లలితామహల్ రైల్వేగేట్, గంజ్ గేట్ నంబర్-2, గోదాం రోడ్, దేవీరోడ్, భగత్‌సింగ్ చౌరస్తా, గాంధీ చౌక్, నెహ్రూపార్క్, పెద్దబజార్ చౌరస్తా, న్యాల్‌కల్ రోడ్ చౌరస్తా ప్రాంతాల్లో 22వ తేదీ రాత్రి 8 నుంచి 24వ తేదీ ఉదయం 6 గంటల వరకు వాహనాలను రోడ్డుపైన పార్క్ చేయరాదని పేర్కొన్నారు. నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించి సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి, ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోస్రాలో ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు మేనల్లుడి వివాహం ఆదివారం జరిగింది. వివాహ వేడుకకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆహ్వానించారు. - చందూర్, ఏప్రిల్ 21

తాగు నీటి సమస్య లేకుండా చూడాలి

ఏర్గట్ల, ఏప్రిల్ 21: వేషవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీవో శివచరణ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రామాల్లో నీటి ట్యాంకులతోపాటు, ప్రతి ఇంటి వద్ద తాగునీటి నల్లాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. ఎక్కడైనా తాగునీటి సమస్యలుంటే వెంటనే మరమ్మలు చేపట్టి నీరందించాలని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 4 తులాల బంగారం, 45 తులాల వెండి, రూ. 50 వేల నగదు చోరీ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 21 : నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లగుట్ట తండాలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగుట్ట తండాకు చెందిన ఉప్పులంచ్వారు శ్రీరామ్ తన ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి ఎల్లారెడ్డి గ్రామంలోని ఓ పెండ్లికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు.. ఇంటి తాళం పగులగొట్టి 4 తులాల బంగారు ఆభరణాలు, 45 తులాల వెండి వస్తువులతోపాటు రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. శ్రీరామ్ శనివారం రాత్రి 8 గంటలకు తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

సిరికొండ, ఏప్రిల్ 21 : మండలంలోని దూప్యాతండా గ్రామానికి చెందిన మలావత్ నవీన్ (29) విద్యుదాఘాతంలో ఆదివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూప్యాతండా గ్రామశివారులో తాను నడుపుతున్న ట్రాక్టర్‌కు మొరం లోడ్ ట్రాలీ బోల్తాపడింది. ట్రాలీని ఇనుప కండి తీస్తున్న క్రమంలో నవీన్ చేతిలో ఉన్న ఇనుప కండి హైటెన్షన్ వైర్లకు తగలడంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. నవీన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

కామారెడ్డి, ఏప్రిల్ 21 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ హైస్కూల్‌లో 2000-2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్థానిక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమేళనం నిర్వహించారు. 24 సంవత్సరాల తర్వాత కలుసుకొని విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కోట మైసమ్మను దర్శించుకున్న ఏసీపీ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 21 : జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఉన్న కోట మైసమ్మ అమ్మవారిని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి.. నగర సీఐ నరహరితో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏసీపీ, సీఐను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శకుంతలా దేవికి ఘన నివాళి

నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నర్సయ్య, సిబ్బంది, విద్యార్థులు

సిరికొండ, ఏప్రిల్ 21 : ప్రపంచ ప్రసిద్ధ గణిత, ఖగోళ, జ్యోతిష్య శాస్త్రవేత్త, హ్యూమన్ కంప్యూటర్ శకుంతలా దేవి 11వ వర్ధంతిని మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు.

ప్రిన్సిపాల్ నర్సయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు శకుంతలా దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడుతూ.. గణితమే జీవితంగా భావించిన అపర మేధావి, క్లిష్టమైన గణిత సమస్యలకు సైతం అవలీలగా సమాధానం చెప్పగల మానవ గణన యంత్రం శకుంతలాదేవి అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు గణితంపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రూ.17లక్షల 7వేలు స్వాధీనం

మోర్తాడ్, ఏప్రిల్ 21: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలం కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బైక్‌పై ఓ వ్యక్తి రూ.17లక్షల ఏడు వేల నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఓవ్యక్తి అనుమానాస్పదంగా బైక్‌పై వస్తుండగా తనిఖీ చేశామని, వ్యక్తి వద్ద బ్యాగులో రూ.17లక్షల ఏడువేల ఉన్నాయని, వాటికి సంబంధించిన పత్రాలు చూయించక పోవడంతో డబ్బును సీజ్ చేశామని తెలిపారు.

నవీపేటలో రూ.లక్షా60 వేలు..

నవీపేట, ఏప్రిల్ 21: ఎన్నికల కోడు అమలులో ఉన్నందున నిబంధనలకు వ్యతిరేకంగా ఆదివారం ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా బైక్‌పై తరలిస్తున్న రూ.లక్షా60 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. పోలీసులు వాహనాల తనిఖీ సమయంలో మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఫర్వేస్ ఖతీక్ నిజామాబాద్ నుంచి రాంపూర్ రోడ్డు గుండా మహారాష్ట్రకు బైక్‌పై రూ.65 వేలను తరలిస్తున్నాడు. రాంపూర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. నవీపేటకు చెందిన హర్షద్ ఖురేషి బైక్‌పై రూ. 95 వేలు తరలిస్తుండా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నగదును సోమవారం కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. ఒక వ్యక్తి 50వేల కంటే ఎక్కవ మొత్తం తరలిస్తే సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందని అన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా రూ.50వేల వరకు తరలించేందుకు అనుమతి ఉందని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, PERKA SAYANNA S/o. Perka Narsaiah R/o.H.No.6-73, Mentrajpally, Dichpally, Nizamabad, T.S., change my new name as BODDU SAYANNA S/o. Boddu Nadipi Narsaiah
NTZ-324905

CHANGE OF NAME

★I, PERKA LAXMI BAI W/o. Perka Narsaiah R/o.H.No.6-73, Mentrajpally, Dichpally, Nizamabad, T.S., change my new name as BODDU LAXMI W/o. Boddu Nadipi Narsaiah
NTZ-324904

CHANGE OF NAME

★I, PERKA RAJITHA W/o. Perka Sayanna R/o.H.No.6-73, Mentrajpally, Dichpally, Nizamabad, T.S., change my new name as BODDU RAJITHA W/o. Boddu Sayanna
NTZ-324906

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.